క్లుప్తంగా

గండిని పూడ్చివేయండి



సిద్ధాపురం చెరువుకు గండిపడిన దృశ్యం

ఆత్మకూరు: మండల పరిధిలోని సిద్ధాపురం చెరువు చిన్నతూము వద్ద స్వల్పంగా గండి పడిందని సిద్ధాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ చిన్న తూము వద్ద పడిన గండిని పూడ్చివేయాలని అధికారులను కోరారు. ఇప్పటికి చెరువులో ఆరు అడుగుల నీరు నిలిచివుందని చెప్పారు. వర్షాలు ఇంకా కురిస్తే చెరువులకు మరింత నీరు వచ్చి చేరితే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు.

కూలిన మట్టి మిద్దెలు



పైకప్పు కూలిన ఇల్లు

పగిద్యాల: మండలంలోని పడమర ప్రాతకోటలో రెండు మట్టి మిద్దెలు కూలిన ఘటన శనివారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన కటికె రఫీ, కటికె మాబాషాలకు చెందిన మట్టి మిద్దెల పైకప్పు ఊడి పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు మిద్దెలు నాని దెంతలతో సహా పడిపోయినట్లు బాధితులు పేర్కొన్నారు. ఇళ్లంతా పాటుకు తీసుకోవడం చూసి ముందు జాగ్రత్తగా రెండు రోజులు క్రితమే వేరే ఇంట్లో చేరుకున్నామని, లేదంటే ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయే వారమని వాపోయారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

ఆత్మకూరు: పట్టణంలో ఈ నెల 31న నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాసులు, ప్రతాప్ పిలుపునిచ్చారు. శనివారం మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో తొలిసారిగా జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని, ఈ సమావేశంలో కార్మికుల సమస్యలు, స్థానిక రైతు, ప్రజా సమస్యలపై, రాజకీయాలపై పార్టీ నాయకులు మాట్లాడడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటశివుడు, అహ్మద్‌హుస్సేన్, లాలు, చాంద్‌బాషా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు ఉద్యోగాలు ఇవ్వాలి

జూపాడుబంగ్లా: శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వస్వం కోల్పోయిన నీటిముంపు నిర్వాసితులకు జీవో 98 ప్రకారంగా తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలని సీపీఐ పార్టీ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన తంగడంచలో విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వస్వం త్యాగంచేసిన నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలు కనీసం తాగు, సాగునీటికి నోచుకోవటం లేదన్నారు. నియోజకవర్గం చుట్టూ నీళ్లున్నా సక్రమంగా సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

'చలో హైదరాబాద్‌ను' జయప్రదం చేయండి

మహానంది: హైదరాబాద్ లో ఆగస్టు 2వ వారంలో జరగనున్న చలో హైదరాబాద్ విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ పూల వెంకటసుబ్బన్న, జిల్లా నాయకులు గాజులపల్లె నరసింహ కోరారు. గోపవరం గ్రామంలో శనివారం ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ మండల కన్వీనర్ చెవుల వెంకట సుబ్బయ్య, నాయకులు శివకుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

శతావధాన పద్య సంపుటి ఆవిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): చిన్నయసూరి సాహితీ సమితి నంద్యాల ఆధ్వర్యంలో ప్రచురించిన శతావధాన పద్య సంపుటిని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి శనివారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ తెలుగు సాహితీ ప్రక్రియలో అవధానం విశిష్టమైనదన్నారు. సాహితీ ప్రియులకు అవధానం ఒక సారస్వత వినోదమని తెలుగు వారికే సొంతమైన అవధానానికి ఆదరణ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు పండిట్ అన్నెం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ రమణమూర్తి సంపాదకత్వంలో రూపొందిన శతావధాని శ్రీ వద్దిపర్తి పద్మాకర్ 14వ శతావధాన పద్య పుస్తకం పాఠకులను అలరిస్తుంది. భావితరాలకు అవధాన ప్రక్రియను పరిచయం చేయడానికి చిన్నయసూరి సాహితీ సమితి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సాహితీ సంస్థ ప్రతినిధులు శేషఫణి, వెంకటేశ్వర్లు, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరైన యాజమాన్య పద్ధతులతో పైర్లకు రక్ష

- వర్షాల వల్ల నీట మునిగిన పైర్లు
- సరైన పద్ధతులు పాటిస్తే పంటను కాపాడుకోవచ్చు
- వివిధ రకాల పంటలపై వ్యవసాయ అధికారుల సూచనలు



మొక్కజొన్న చేనులో నిలిచిన వర్షపు నీరు

పాములపాడు: ప్రస్తుతం కురిసిన వర్షాల వల్ల చాలా రకాల పంటలు నీట మునిగాయి. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటలను కాపాడుకోవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా వ్యవసాయశాఖ అధికారుల సూచనలు సలహాలు పాటించాలంటున్నారు.

13,543 హెక్టార్లలో పంటల సాగు

ప్రస్తుతం జిల్లాలో 13,543 హెక్టార్లలో వివిధ రకాల పైర్లు సాగులో ఉన్నాయి. వర్షాల వల్ల వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని వివిధ రకాల చీడ పీడలు ఆశించే అవకాశం ఉంది. ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలో పత్తి 2,049 హెక్టార్లలో సాగయ్యింది. మొక్కజొన్న 7,739, కంది 6,722, వేరుశనగ 2,350, మినుము 1,885, ఆముదం 2,148, సోయాబీన్ 209, మిరప 229 హెక్టార్ల చొప్పున సాగులో ఉంది.

యాజమాన్య పద్ధతులు, చీడ పీడల నివారణ

- పొలంలో నీరు నిలబడకుండా పాదుల ద్వారా నీరు తీసేయ్యాలి.
- పొలం ఆరిన వెంటనే అంతర సేద్యం చేసుకోవాలి.
- సిఫారసు చేసిన ఎరువులనుపై పాటుగా సూచించిన విధంగా వేసుకోవాలి.
- చీడ పీడలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి.
- పత్తి మొక్కజొన్న కంది, ఆముదం, మిరప పంటలలో అధిక వర్షాలకు భూమి ద్వారా సంక్రమించే ఎండు తెగులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఈ తెగులు ఆశించిన మొక్కల కాండాన్ని చీల్చి చూసినప్పుడు మధ్యలో గోధుమరంగు చార కనిపిస్తుంది. నివారణకు కార్బండిజిం 1 గ్రాము లేదా కాపర్ ఆక్సి క్లోరైడ్ మందులైన బ్లైట్రాక్స్ లేదా పెట్రోల్ మందును 3 గ్రాముల నీటిలో కలిపి మొక్క మధ్యలో పోయాలి.

అపరాలు –కంది, మినుము, సోయాబీన్..

ప్రస్తుతం ఈ పంటలు 30 రోజుల దశలో ఉన్నాయి. ఇప్పుడు యూరియా లేదా 19:19:19 ఎరువులను 10 గ్రాములు లీటరు నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేసుకోవాలి.

పత్తి పంట..

పత్తి పంట ప్రస్తుతం 2 నుంచి 3 నెలల దశలో ఉంది. ఈ పంట ఎకరాకు 30 కిలోల యూరియా, 25 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్ కలిపి మొక్క మొదళ్ల వద్ద వేసుకోవాలి.

మొక్కజొన్న..

ప్రస్తుతం మొక్కజొన్న 2 నెలల దశలో ఉంది. ఎకరాకు 45 కిలోల యూరియాను వేసుకోవాలి. మ్యురేట్ ఆఫ్ పొటాష్ కలిపి మొక్క మొదళ్ల వద్ద వేసుకోవాలి.

ఆముదం..

ప్రస్తుతం ఆముదము పంట 30 రోజుల దశలో ఉంది. ఎకరాకు 15 కిలోల యూరియా పై పాటుగా వేసుకోవాలి.

వేరుశనగ..

ప్రస్తుతం వేరుశనగ పంట 30 రోజుల దశలో ఉంది. ఎకరాకు 10 కిలోల యూరియాపై పాటుగా వేసుకోవాలి. ఈ వర్షాల వల్ల వేరుకుళ్లు, తిక్కా ఆకుమచ్చ తెగులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నివారణకు కార్బండిజమ్1 గ్రాము లేదా మాంకో జెబ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్లలో పోయాలి. తిక్క ఆకుమచ్చ తెగులు తీవ్రత తక్కువగా ఉంటే కార్బండిజమ్ 1 గ్రాము లేదా మాంకోజెబ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తీవ్రత ఎక్కువగా ఉంటే హెక్సాకోనజోల్ 2 మిల్లీలీటర్లు లేదా టెబుకోనజోల్ 1 మిల్లీ లీటరు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అధిక వర్షాలకు వేరుశనగ పంటలో ఇనుము ధాతు లోపం వచ్చే అవకాశం ఉంది. ఇనుప ధాతు లోపం వచ్చిన ఆకులు తొలుత పసుపు పచ్చగాను, తర్వాత తెలుపు రంగుకు మారుతాయి. నివారణకు 5 గ్రాములు అన్నబేది, 1 గ్రాము నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేయాలి.

సస్యరక్షణ తప్పనిసరి



ఎడతెరిపిలేని వర్షాల వల్ల రైతులు సాగు చేసుకున్న పంటలు చాలా వరకు నీట మునిగాయి. వీటిని రక్షించుకోవాలంటే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. లేకపోతే పైర్లు కుళ్లి పోడవం లేదా తెలుళ్లు సోకే ప్రమాదం ఉంది. ఏమైనా సందేహాలు ఉంటే రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సూచనలు పాటించాలి.

– ఫణీశ్వరరెడ్డి, ఏఓ, పాములపాడు

కిసాన్ సమృద్ధి కేంద్రం సేవలను వినియోగించుకోండి

పగిద్యాల: రైతు శ్రేయస్సు దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసిందని, వీటి సేవలను రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని నందికొట్కూరు నియోజకవర్గ బీజేవైఎం ఇన్‌చార్జ్ కె. సుంకన్న కోరారు. శనివారం మండలంలోని పాత ముచ్చుమర్రిలోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. షాపు నిర్వాహకుడు మురళీ, పెద్ద రంగడు, బాలు, రాజశేఖర్, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

వరద రాజస్వామి ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల నిలిపివేత

ఆత్మకూరు: మండల పరిధిలోని వరద రాజస్వామి ప్రాజెక్ట్ నుంచి సాగునీటి విడుదలను నిలిపివేసినట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ నాగన్న తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నల్లమలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 20 ఏళ్లలో తొలిసారిగా జూలై నెలలో ప్రాజెక్ట్ నిండి భారీగా నీరు వచ్చి చేరడంతో 400 క్యూసెక్కుల నీటిని పంట కాల్వలకు, చెరువులకు విడుదల చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం వర్షాలతో పాటు నల్లమలలో ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో కూడా లేకపోవడంతో చెరువులకు విడుదల చేస్తున్న నీటిని నిలిపివేసినట్లు చెప్పారు. మళ్లీ రైతులకు అవసరం అయినప్పుడు ప్రాజెక్ట్ నీటిని విడుదల చేస్తామని చెప్పారు.

పెద్దపులి సంరక్షణతోనే మానవ మనుగడ



వక్తృత్వ పోటీలో పాల్గొన్న విద్యార్థిని



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

ఆత్మకూరురూరల్: పులులను సంరక్షించుకోవడం ద్వారా మనలను మనం, భావితరాల వారిని కాపాడుకోగలుగుతామని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ పెద్దపులుల దినోత్సవాన్ని శనివారం ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని నల్లకాల్వ శివారుల్లో ఉన్న వైఎస్‌ఆర్ స్మృతివనంలో అటవీ అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులతో అటవీ అధికారులు సమావేశం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో పులి సంరక్షణ ఎంతో కీలకమైనదన్న విషయాన్ని వివరించారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఆపై పులి సంరక్షణపై తీసిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వోలు పట్టాభి, దొరస్వామి, రామకోటి, సుభాష్, ఖాన్ పాల్గొన్నారు.

పెద్దపులి రక్షణతో పర్యావరణ పరిరక్షణ

శ్రీశైలంప్రాజెక్ట్: అడవులు పెరిగి పర్యావరణం సమతుల్యంగా ఉండాలంటే పులులను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బయోడైవర్సిటీ అసిస్టెంట్ కన్జర్వేటర్ ధనరాజ్ అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా శనివారం సున్నిపెంటలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని గిరిజన పాఠశాలలో మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న జాబితా నుంచి పులిని తప్పించాలని, పులులు లేకపోతే శాఖాహార జంతువులు పరిమితిని మించి పెరిగిపోయి జీవావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి వి.నరసింహులు, సెక్షన్ అధికారులు మదన్, ఓబులేసు, శంకర్, బీట్ ఆఫీసర్లు సలాముల్లా, ఎస్ భీమ్‌నాయక్, ఆర్ బాలాజీ, జెఎమ్ ఆర్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'గడప గడపకు మనప్రభుత్వం'

మహానంది: బండిఆత్మకూరు మండలం లింగాపురం గ్రామంలో సోమవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారన్నారు. దీంతో పాటు మరుసటి రోజు మంగళవారం జీసీ పాలెం గ్రామంలోనూ కార్యక్రమం ఉంటుందన్నారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

రోడ్డుపై దొరికిన బ్యాగ్ అప్పగింత

- బ్యాగ్‌లో రూ. 4.80 లక్షల విలువ గల బంగారు నగలు



బంగారుతో పాటు బ్యాగ్‌ను అందజేస్తున్న టౌన్ సీఐ, ఎస్‌ఐ, పోలీసులు

నందికొట్కూరు: మిడుతూరు మండలం నాగలూటి గ్రామానికి చెందిన షరీఫాబీ కూతురు రేష్మను తెలంగాణ రాష్ట్రం పెబ్బేర్‌కు చెందిన బట్టల వ్యాపారి ఖాసీంకు ఇచ్చి వివాహం చేశారు. మొహర్రం పండుగ సందర్భంగా షరీఫాబీ కూతురు, అల్లుడు అత్తారింటికి వచ్చారు. శుక్రవారం తిరుగు ప్రయాణమయ్యారు. అయితే రేష్మ భర్తకు తెలియకుండానే బ్యాగులో 8 తులాల బంగారు నగలు పెట్టింది. బ్యాగులను కారుటాపుపైన వేసుకుని బయల్దేరారు. అయితే నందికొట్కూరు పట్టణ సమీపంలోని కర్నూలు రోడ్డు పైన ఓ బ్యాగ్ పడిపోయింది. మండ్లెం గ్రామానికి చెందిన పాస్టర్ నాగరాజు, ప్రేమరాజు కలిసి బైక్‌పై వెళ్తండగా ఆ బ్యాగ్ దొరికింది. దానిని వారు టౌన్ సీఐ విజయభాస్కర్‌కు అందజేశారు. శనివారం బాధితులు షరీఫాబీ, ఖాసీం.. సింగిల్ విండో చైర్మన్ తులసిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న ఎల్లారెడ్డి, రవీంద్రారెడ్డి, నీలకంఠలతో కలిసి పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. రూ. 4.80 లక్షల విలువ చేసే 8 తులాల బంగారుతో దొరికిన బ్యాగ్‌ను టౌన్ సీఐ, ఎస్‌ఐ నాగార్జున, పోలీసులు బాధితులకు అందజేశారు. బ్యాగ్‌ను పోలీసు స్టేషన్‌కు తెచ్చి అందజేసిన పాస్టర్ నాగరాజును, ప్రేమరాజును టౌన్ సీఐ. ఎస్‌ఐ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

- పీర్లను ఏటికి సాగనంపిన భక్తులు
- ముగిసిన వేడుకలు



ఆత్మకూరులో పెద్ద పీర్ల వీధిలో కొలువు తీరిన హుస్సేన్‌సా పీర్లకు ఫాతెహాలు నిర్వహిస్తున్న భక్తులు



తాటిపాడులో నేలపై పడుకున్న భక్తులను దాటుకుంటూ వెళ్తున్న పీర్లదేవుళ్లు

జూపాడుబంగా: మొహర్రం వేడుకల్లో భాగంగా శనివారం మండలంలోని తాటిపాడు, మండ్లెం, జూపాడుబంగ్లా, తంగడంచ, 80బన్నూరు గ్రామాల్లో కొలువుదీరిన పీర్లను భక్తిశ్రద్ధలతో ఏటికి సాగనంపారు. మూడు రోజులపాటు పీర్లదేవుళ్లకు వేడుకలు నిర్వహించిన భక్తులు నాలుగోవరోజు సాయంత్రం హసన్, హుసేన్, చిన్నఅలీఅక్బర్, పెద్దఅలీఅక్బర్, పెద్దహుసేనాలం, చిన్నహుసేనాలం పీర్లను భక్తులు ఎత్తుకొని, దర్గావద్ద ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. భక్తులు చివరిపర్యాయంగా కొబ్బరికాయలు, ఊదిబత్తీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పీర్లస్వాముల పాదధూళి తాకితే తమ కష్టాలు తీరుతాయనే నమ్మకంతో భక్తులు పీర్లస్వాముల పాదధూళికోసం బారులు తీరారు. గ్రామానికి సమీపంలోని కాల్వలో పీర్లను జలధి చేసి, పెట్టెలో పెట్టుకొని ముస్లింలు విషాద గీతాలను పాడుకుంటూ గ్రామానికి చేరుకున్నారు.

పాములపాడు: గ్రామాల్లో మొహర్రం వేడుకలు శనివారంతో ముగిశాయి. 25వ తేదీన పీర్ల స్వాములను ఆయా గ్రామాల్లోని పీర్ల చావిళ్లలో కొలువు దీరారు. ముగింపు వేడుకల్లో భాగంగా మండలంలోని జూటూరు, మిట్టకందాల, యర్రగూడూరు, గ్రామాల్లో పీర్ల స్వాములను ఊరేగింపుగా ఏటికి సాగనంపారు. తాటిపాడు గ్రామంలో కొలువు దీరిన పీర్లదేవుళ్లను ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ దర్శించుకున్నారు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ రమాదేవి, జిల్లా ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ జాకీర్‌హుసేన్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని దామగట్ల, మల్యాల గ్రామాల్లో శనివారం మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పీర్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామాల్లోని పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ ఏసురత్నం, మైనార్టీ నాయకులు జావీద్, తదితరులు పాల్గొన్నారు.

కుల మతాలకతీతంగా వేడుకలు

కొత్తపల్లి: గ్రామాలలో శనివారం కుల, మతాలకతీతంగా ప్రజలు మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని ముసలిమడుగు, పెద్దగుమ్మడాపురం, ఎర్రమఠం, దుద్యాల గ్రామాలలో ప్రజలు పీర్లను పూలమాలతో అలంకరించి, పురవీధుల వెంట ఊరేగించారు. పీర్లను ఏటికి సాగనంపే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

పగిద్యాల: మండలంలోని నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు, తూర్పు, పడమర ప్రాతకోట గ్రామాల్లో ఈనెల 25 నుంచి ప్రారంభమైన మొహరం వేడుకలు శనివారంతో ముగిశాయి. పీర్లను గ్రామ పురవీధుల గుండా ఊరేగించి సంబరాలు చేశారు. అత్యంత మహిమాన్వితుడైన తిక్కస్వామి పీరును భక్తులు భక్తితో పూజించి మొక్కులు తీర్చారు. అనంతరం పీర్లను ఏటికి సాగనంపి సంప్రదాయాన్ని చాటుకున్నారు. ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున బందోబస్తు చర్యలు చేపట్టారు.

మహానంది: కులమతాలకు అతీతంగా గ్రామాల్లో మొహర్రం వేడుకలు వైభవంగా జరిగాయి. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం, గాజులపల్లె, బుక్కాపురం, అబ్బీపురం, బొల్లవరం, తమ్మడపల్లె, పుట్టుపల్లె, గోపవరం, తదితర గ్రామాల్లో పీర్లస్వాములకు వేకువజాము నుంచి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు రాత్రి నుంచి మకానాల్లో కొలువైన పీర్లస్వాములను దర్శించుకుని ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు. సాయంత్రం నుంచి ఏటికి వెళ్లే కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల్లో ప్రజలు పండుగలో పాల్గొని తరించారు.



ముసలిమడుగు గ్రామంలో ఊరేగింపు కార్యక్రమంలో పీర్లు

ఆత్మకూరు: పట్టణంలోని పెద్దపీర్ల వీధి, పెద్ద మసీదులో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. పీర్లచావిడిలో కొలువుతీరిన పీర్లకు భక్తులు శనివారం మొహర్రం పండుగ సందర్భంగా ఫాతెహాలు నిర్వహించారు. పెద్ద మసీదు వద్ద గిరిజనులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాది మొహర్రం పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం విశేషం.



గాజులపల్లెలో ఏటికి వెళ్తున్న పీర్లస్వాములు,



ఉప్పలదడియలో పీర్లకు ఫాతెహాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మీకు మంచి జరిగితేనే మాకు మద్దతివ్వండి

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- వేల్పనూరు గ్రామంలో 'జగనన్న సురక్ష'
- జేఎల్‌జీ గ్రూపు మహిళలకు రూ.1.20 కోట్ల రుణాలు పంపిణీ



జేఎల్‌జీ గ్రూపులకు రుణాల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా మీరు లబ్ధి పొంది, మీ ఇంట్లో మంచి జరిగితేనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ప్రజలకు మంచి చేసే వ్యవస్థను అనుమానించవద్దని విపక్షాలకు సూచించారు. వేల్పనూరు గ్రామంలోని 1, 2వ సచివాలయాల పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందించారు. 1వ సచివాలయం పరిధిలో 1,508 వినతులు రాగా 1501 పరిష్కరించారు. 2వ సచివాలయ పరిధిలో 966 వినతులకు గాను 961 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. మిగతావి కూడా వారం రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

అందరికీ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష

ప్రతి ఇంటికి వలంటీర్లు వెళ్లి వారి కష్ట సుఖాలను, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అన్నది తెలుసుకుంటున్నారని ఎమ్మెల్యే చెప్పారు. పథకాలు అందకపోతే తక్కువ సమయంలో అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నామన్నారు. గతంలో ఏ పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ, జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి లంచాలు ఇచ్చుకునే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా పోయింది.

రూ.1.20 కోట్ల రుణాల పంపిణీ

రేగడగూడురు సొసైటీ పరిధిలోని 63 జేఎల్‌జీ గ్రూపులకు గాను రూ.1.20 కోట్లు ఎమ్మెల్యే శిల్పా చేతుల మీదుగా మహిళలకు రుణాలు అందించారు. ఈ సొసైటీ పరిధిలో ఇప్పటి వరకు వ్యవసాయ, మధ్యకాలిక రుణాలు, వ్యక్తిగత రుణాలు, రైతు నేస్తం, రాజన్న చేయూత, జేఎల్‌జీ, గొర్రెల పెంపకం, పాడి పరిశ్రమ కింద రూ.15.70 కోట్లు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అంతకు ముందు గ్రామ నాయకులు ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. దుశ్శాలువాలు, పూలమాలతో సత్కరించారు. కాగా, ఉదయం వెలుగోడు గ్రామంలో నూతనంగా నిర్మించిన 1వ సచివాలయం భవనాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, రేగడగూడురు సింగిల్ విండో చైర్‌పర్సన్ బన్నూరు లక్ష్మీదేవి, ఎంపీటీసీలు బన్నూరు తోయ జనాభారెడ్డి, పల్లె వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



రుద్రకోడు చెంచులకు టార్పాలిన్ పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

చెంచులకు టార్పాలిన్ల పంపిణీ

ఆత్మకూరురూరల్: మండలంలోని నల్లకాల్వ గ్రామ శివారుల్లో ఉన్న రుద్రకోడు చెంచు గూడెంలోని చెంచులకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి శనివారం టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేశారు. తమ ఇళ్ల పైకప్పులు వర్షాలకు కారుతున్నాయని పలువురు చెంచులు ఎమ్మెల్యేకు విన్నవించడంతో స్పందించిన ఆయన ఐటీడీఏ పీవో బి. రవీంద్రరెడ్డికి సమస్య పరిష్కారానికి ఆదేశాలు జారి చేశారు. దీంతో ఐటీడీఏ అధికారులు మొత్తం 28 మంది చెంచులకు ఇళ్లపై కప్పుకునేందుకు తారుపట్టాలను మంజూరు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శిల్పా భువనేశ్వరరెడ్డి, ఐటీడీఏ ఏపీఓ కేజీ నాయక్, ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ శంకరరెడ్డి, ఎంపీటీసీ శాంతమ్మ, సర్పంచ్ వెంకట రమణ, మార్కెట్ కమిటి చైర్మన్ బాలస్వామి, నాయకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం



పీర్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

మిడుతూరు: మత సామరస్యానికి ప్రతీక మొహర్రం వేడుకలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, శాసనమండలి సభ్యులు డాక్టర్ మధుసూదన్ అన్నారు. శనివారం మండలపరిధిలోని ఉప్పలదడియ గ్రామంలోని మొహర్రం వేడుకలలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సల్కోటి గోవర్ధన్‌రెడ్డి, కమతం రాజశేఖర్ రెడ్డి, కమతం మహేశ్వరరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.